ఆంధ్రజ్యోతి
andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 39.9 ; కనిష్ఠం 25.6
నిజామాబాద్ జిల్లా వార్తలు
5
గురువారం 15 మే 2025




- ఈయేడు రుణాలు అందించేందుకు నిర్ణయించిన బ్యాంకర్ల కమిటీ
- జిల్లాలో అన్ని రంగాలకు కలిపి 17వేల 990 కోట్ల రుణాలకు ఏర్పాట్లు
- వానాకాలం, యాసంగిలో పంట రుణాలకు రూ.4,826 కోట్లు కేటాయింపు
- జూన్ ఆరంభం నుంచే పంట రుణాలు ఇచ్చేందుకు కసరత్తు



రుణ ప్రణాళిక ఖరారు

నిజామాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఈయేడు రుణాలను అందించేందుకు క్రెడిట్ ప్లాన్‌ను బ్యాంకర్ల కమిటీ నిర్ణయించింది. ఈ ప్లాన్‌కు అనుగుణంగానే జిల్లాలో రుణాలను అందించనున్నారు. రైతులకు ఇచ్చే పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలను ఖరారు చేశారు. వీటితో పాటు వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో యాంత్రికరణలో భాగంగా పనిముట్లను ఇచ్చేందుకు లక్ష్యాలను నిర్ణయించారు. వీటితో పాటు చిన్న పరిశ్రమలు, మహిళా సంఘాలకు అందించే రుణ ప్రణాళికలను కూడా ఖరారు చేశారు. జిల్లాలో నిర్వహించే బ్యాంకర్ల కమిటీ ద్వారా విధివిధానాలు ప్రకటించి పూర్తిస్థాయిలో రుణాలు అందించేందుకు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా రుణాలు అందించేందుకు జూన్ ఆరంభం నుంచే ఏర్పాట్లను చేస్తున్నారు. రైతులతో పాటు చిన్న పరిశ్రమల వారికి కూడా ఈ రుణాలను అందించనున్నారు.



పంటలతో పాటు పరిశ్రమలు, ఇళ్ల నిర్మాణాలకూ రుణాలు

జిల్లాలో ప్రతీ సంవత్సరం ఖరీఫ్, యాసంగిలో అందించే రుణ ప్రణాళికలను రాష్ట్ర బ్యాంకర్ల కమిటీ ఖరారు చేసింది. జిల్లాల లక్ష్యాలను కూడా నిర్ణయించింది. ఆ వివరాలను జిల్లాలకు పంపించింది. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం 17వేల 990 కోట్ల రూపాయలను రుణాలను అందించేందుకు నిర్ణయించారు. బ్యాంకర్ల కమిటీలో ఖరారు చేశారు. పంట రుణాలతో పాటు పరిశ్రమలకు, ఇళ్ల నిర్మాణాలకు, మౌలిక వసతుల కల్పనకు, సోలార్ ఎనర్జీతో పాటు ఇతర రంగాలకు ఇచ్చే రుణాలను ఖరారు చేశారు.

వానాకాలం, యాసంగికి కలిపి 4,826 కోట్ల రుణాలు

జిల్లాలో ఈ సంవత్సరం పంట రుణాల కోసం వానాకాలం, యాసంగికి కలిపి మొత్తం 4,826 కోట్ల రూపాయలను రుణాలుగా ఇవ్వాలని నిర్ణయించారు. దీనిలో 3వేల కోట్ల వరకు వానాకాలంలో రుణాలు ఇవ్వాలని నిర్ణయించగా, రూ.1800 కోట్ల వరకు యాసంగిలో ఇచ్చే విధంగా ఖరారు చేశారు. జూన్ ఆరంభం నుంచే వానాకాలం సాగు రైతులు మొద లు పెట్టనుండటంతో వానాకాలం పంటల కోసం రుణాలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు పూర్తిస్థాయిలో రైతులకు రుణాలను అందించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్త రైతులతో పాటు ఇప్పటికే రుణాలు తీసుకున్న రైతులకు కూడా ఇవ్వనున్నారు. పాత రుణాలను చెల్లించగానే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం కొత్త రుణాలు ఇచ్చే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు. రైతులు దీర్ఘకాలికంగా వ్యవసాయంపై ఆధారపడి ఏర్పాటు చేసే పనుల కోసం రుణాలు ఇచ్చేందుకు నిర్ణయించారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు కూడా కలిపి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2221 కోట్ల రూపాయలను అందించేందుకు ఏర్పాట్లు చేశారు. వ్యవసాయంపై ఆధారపడిన ఇతర రంగాలకు రూ.932 కోట్లు ఇచ్చేందుకు నిర్ణయిం చారు. రైతులు దీర్ఘకాలిక రుణాలు తీసుకొని వ్యవసాయానికి ఉపయోగపడే ట్రాక్టర్లు, ట్రిల్లర్లు, ఇతర యంత్రాలను కొనుగోలు చేసేందుకు ఈ దీర్ఘకాలిక రుణాలను అందించనున్నారు. ఇవే కాకుండా వ్యవసాయ, అనుబంధ రంగాల్లో పరిశ్రమలు, మౌలిక వసతులను కల్పించేందుకు రుణాలు ఇచ్చేందుకు నిర్ణయించారు. వ్యవసాయానికి సంబంధించిన మౌలిక వసతుల కోసం 280.81 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు పెట్టేందుకు ఈ ఆర్థిక సంవత్సరంలో 1134.90 కోట్లు రుణాలు ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకున్నారు. పూర్తిస్థాయిలో ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు లక్ష్యాలను సాధించే విధంగా అన్ని బ్యాంకులకు ఆదేశాలను ఇచ్చారు. ప్రభుత్వ రంగ బ్యాంకులతో పాటు సహకార, గ్రామీణ బ్యాంకులకు కూడా ఈ లక్ష్యాలను నిర్దేశించారు. ఇవేకాకుండా జిల్లాలో చిన్న పరిశ్రమలు, సూక్ష్మ పరిశ్రమలు, మధ్య తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు రుణాలు అందించేందుకు లక్ష్యాలను నిర్దేశించారు. ఈ సంవత్సరం సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటు కోసం రూ.192 కోట్లు, చిన్న పరిశ్రమల ఏర్పాటు కోసం రూ.2128 కోట్లు, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటు కోసం రూ.1680 కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటు కోసం తోడ్పాటును అందించేందుకు ఈ రుణాలు అందించనున్నారు. ఇవేకాకుండా విద్యార్థుల చదువుల కోసం జిల్లాలో రూ.91కోట్లు, గృహ నిర్మాణం కోసం రూ.183.75 కోట్లు, సామాజిక వసతుల కల్పనకు 37 కోట్లు, సోలార్ ఎనర్జీ కోసం రూ.28.80 కోట్లు, ఇతర పనుల కోసం రూ.1.40 కోట్లు రుణాలుగా ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇవేకాకుండా నాన్ ప్రయారిటీ సెక్టార్ కింద ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.4061.97 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయం తీసుకున్నారు. ఆయా సెక్టార్లకు సంబంధించి జిల్లాలో అన్ని బ్యాంకులకు లక్ష్యాలను నిర్దేశించారు. జూన్ ఆరంభం నుంచే రుణాలు ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకున్నారు. పంటలు ముందుగానే రైతులు వేయనుండటంతో పెట్టుబడి కోసం రుణాలు అందించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. బ్యాంకర్ల కమిటీలు తీసుకున్న నిర్ణయాల ప్రకారం క్రెడిట్ ప్లాన్‌కు అనుగుణంగా జిల్లాలో పంట రుణాలతో పాటు ఇతర రుణాలను అందిస్తామని లీడ్ బ్యాంక్ మేనేజర్ అశోక్ చౌహాన్ తెలిపారు. ఆయా బ్యాంకులకు ఈయేడాదికి సంబంధించిన లక్ష్యాలను నిర్దేశించామన్నారు. ఆ లక్ష్యాలకు అనుగుణంగా రుణాలను అందిస్తామని తెలిపారు. వ్యవసాయ అనుబంధ రంగాలతో పాటు చిన్న పరిశ్రమలు, మధ్యతర హా పరిశ్రమలకు ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు.

నేటి నుంచి సరస్వతి నది పుష్కరాలు



నిజామాబాద్ కల్చరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): గంగ, యమున నదుల తర్వాత ప్రసిద్ధి చెందిన సరస్వతి నది పుష్కరాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించినప్పుడు సరస్వతీనది పుష్కరాలు ప్రారంభమవుతాయి. బృహస్పతి 15వ తేదీ ఉదయం 4గంటలకు ప్రవేశించడంతో పుష్కరాలు ఆరంభమవుతాయని శాస్త్రం చెబుతోంది. సరస్వతి నది పుష్కరాలను పురస్కరించుకొని కాళేశ్వరంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కాళేశ్వరంలో త్రివేణి సంగమంలో అంతర్వాహినిగా సరస్వతీనది ప్రవహిస్తుంది. పుష్కరాలు ప్రారంభం సూచికగా వేదపండితులు వేదమంత్రోచ్చరణలతో నదికి ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కర హారతి ఇవ్వనున్నారు. 12 రోజుల పాటు సరస్వతి నది పుష్కరాలు కొనసాగుతాయి. మరణించిన వారికి పుష్కరాలలో పిండప్రదానంతో పాటు తర్పణాలు సమర్పించుకోవడం సంప్రదాయంగా వస్తుంది. జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పుష్కర పుణ్య స్నానాలు ఆచరించడానికి తరలివెళ్లనున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి

: డీఈవో అశోక్



మాట్లాడుతున్న డీఈవో అశోక్

మోపాల్, మే 14 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని డీఈవో అశోక్ అన్నారు. బోర్గాం(పి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితం, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులకు కొనసాగుతున్న శిక్షణ కేంద్రాన్ని డీఈవో అశోక్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయులకు బడిఈడు పిల్లలను బడిలో చేర్పించే విషయంలో పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఈ విషయంలో బోర్గాం(పి) ప్రభుత్వ పాఠశాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోర్సు ఇన్‌చార్జి శంకర్, గణితశాస్త్ర రాష్ట్ర పరిశీలకుడు ప్రభాకర్ ఉన్నారు.

కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు

నిజామాబాద్ అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ఆదేశాల మేరకు సమగ్ర శిక్షా సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో కరిక్యూలర్ అండ్ థెరపిక్ స్ట్రాటజీస్ ఫర్ సీడబ్ల్యూఎస్ఎల్ అనే అంశంపై బుధవారం నగరంలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు రెండో రోజు శిక్షణ తరగతులు ఓ ప్రైవేటు పాఠశాలలో నిర్వహించారు. సమగ్ర శిక్షా సహిత విద్యా విభాగం కోఆర్డినేటర్ పడకంటి శ్రీనివాస్‌రావు అధ్యక్షతన నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను డీఈవో అశోక్ ఆకస్మికంగా పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీ, ప్రత్యేక ఉపాధ్యాయులు, రిసోర్స్‌పర్సన్లకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు.

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

● ఆలూర్ బైపాస్ రోడ్డుపై రైతుల ధర్నా



ఆలూర్ బైపాస్ రోడ్డుపై బైఠాయించిన రైతులు

ఆర్మూర్ టౌన్, మే 14(ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ఆలూర్ బైపాస్ రోడ్డు వద్ద రైతులు బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. తాము పండించిన పంటను 20రోజుల క్రితమే కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చినా.. నిర్వాహకులు కొనడం లేదని ఆరోపించారు. అలాగే కొన్నటువంటి ధాన్యాన్ని సైతం నిర్వాహకులు లారీల్లో రైస్‌మిల్లులకు తరలించడం లేదన్నారు. దీనివల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న తరుణంలో.. తాము నిత్యం ఆందోళనకు గురవుతున్నామని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షానికి పలువురు రైతుల ధాన్యం కూడా తడిసిందన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి.. తక్షణమే ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించాలని రైతులు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, డీఎస్‌వో శ్రీనివాస్ ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడారు. హమాలీలను లారీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలిస్తామని హామి ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. కాగా, రైతుల ఆందోళనతో సుమారు గంటపాటు భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. దీంతో ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడి రాకపోకలను పునరుద్ధరించారు.

ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాలను వాడేలా అవగాహన కల్పించాలి



- 33 రకాల సన్నరకం వరి వంగడాలను వినియోగించేలా చూడాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం గుర్తించబడిన వరి విత్తనాలనే జిల్లా రైతులు వినియోగించేలా క్షేత్రస్థాయిలో వారికి అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్‌డీవోలు, మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు, హౌజింగ్ ఏఈలు, ఏపీవోలు, సహకార శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష జరిపారు. ఖరీఫ్ పంటల సాగు ప్రణాళిక, అందుబాటులో ఉన్న ఎరువులు, విత్తనాలు, లైసెన్స్డ్ సర్వేయర్ల శిక్షణ, రేషన్ కార్డుల పరిశీలన, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతి, వన మహోత్సవం, రాజీవ్ యువ శక్తి దరఖాస్తుల పరిశీలన తదితర అంశాల ప్రగతిని కలెక్టర్ ఒక్కోక్క మండలం వారీగా సమీక్షిస్తూ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈసారి ఖరీఫ్‌లో జిల్లాలో 5.6లక్షల ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు సాగు చేస్తారని అంచనా కాగా అందులో ఒక్క వరి పంటనే 4.37లక్షల ఎకరాలలో సాగు చేసే అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. సన్నాలకు ప్రభుత్వం క్వింటాళ్లకు రూ.500 చొప్పున బోనస్ అమలు చేస్తున్న నేపథ్యంలో పూర్తి విస్తీర్ణంలో సన్నరకం వరిపంట సాగు చేస్తారని భావిస్తున్నామన్నారు. అయితే ప్రభుత్వం నుంచి గుర్తించబడిన సన్నరకాల ధాన్యం మాత్రమే కాకుండా మరికొన్ని ఇతర రకాల వరి వంగడాలను జిల్లాలోని కొంత మంది రైతులు వినియోగించడం వల్ల ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యం సేకరణ సందర్భంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఖరీఫ్‌లో రైతులు ప్రభుత్వంచే గుర్తించబడిన 33 రకాల సన్నరకం వరి వంగడాలను వినియోగించేలా చూడాలన్నారు. సిద్ధి, కాంపా సాగర్ వెరైటీ-1, సాంబా మసూరి, జగిత్యాల వెరైటీ-3, జగిత్యాల వెరైటీ-2, వరంగల్ సాంబా, వరంగల్ సన్నాలు, జగిత్యాల మసూరి, పొలాస ప్రభ, కృష్ణ, మానేరు సోనా, తెలంగాణ సోనా, వరంగల్ వెరైటీ-1119, కూనారం వెరైటీ, వరంగల్ వెరైటీ-2, రాజేంద్రనగర్ వెరైటీ-4, కూనారం వెరైటీ-1, జగిత్యాల సన్నాలు, జగిత్యాల సాంబా, కరీంనగర్ సాంబా, అంజనా, మెండూరు మసూరి, ప్రత్యుమ్న, సుగంధ సాంబా, శోభిని, సోమనాథ్, ఆర్ఎన్ఆర్, కేపీఎస్ 6251,

మిగతా 8వ పేజీలో...

- జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లపై దృష్టి పెట్టిన యంత్రాంగం
- రెండో విడత కింద అన్ని నియోజకవర్గాల పరిధిలో లబ్ధిదారుల ఎంపిక
- ఆరు నియోజకవర్గాల్లో 14వేల 295 మంది లబ్ధిదారులకు అనుమతి
- ఇళ్ల నిర్మాణానికి అధికారుల ప్రయత్నాలు
- గృహనిర్మాణ శాఖలో ఖాళీగా ఉన్న ఇళ్లను భర్తీ చేస్తున్న ప్రభుత్వం



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై దృష్టి!





సోన్‌పూర్‌లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు

నిజామాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై యంత్రాంగం దృష్టి పెట్టింది. మొదటి విడత కింద 31 గ్రామాల్లో ఎంపిక పూర్తి చేసి నిర్మాణం చేపట్టిన అధి కారులు మిగతా లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేశారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో రెండో విడత లబ్ధిదారులను ఎంపిక చేశారు. వారికి అనుమతి పత్రాలను ఇవ్వడంతో పాటు గ్రామాల వారీగా నిర్మాణం చేపట్టే విధంగా ప్రయత్నాలను చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణం చేపట్టని వారికి మహిళా గ్రూపుల ద్వారా రుణాలు అందించేందుకు చర్యలు చేపట్టారు. జిల్లాలో నిర్ణయించిన లక్ష్యంకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణం చేపట్టే విధంగా ప్రయత్నాలను చేస్తున్నారు. గృహ నిర్మాణ శాఖలో స్టాఫ్‌ను భర్తీ చేయడంతో పాటు ఇళ్లను యుద్ధప్రాతిపదికన నిర్మాణం చేసేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. జిల్లాలో మంజూరైన ఇళ్లను పూర్తి చేసే విధంగా చర్యలను చేపట్టారు. రెండో విడత ఎంపికైన లబ్ధిదారులకు అవగాహన కల్పించడంతో పాటు ఇళ్ల నిర్మాణం చేసుకునే విధంగా ప్రోత్సహిస్తున్నారు. ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణం ప్రారంభించడంతో పాటు అన్ని గ్రామాల్లో చేపట్టే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

నియోజకవర్గానికి 3500 ఇళ్లు

ప్రభుత్వం ఇందిరమ్మ పథకం కింద నియోజకవర్గానికి 3500 ఇళ్లను మంజూరు చేసింది. మొదటి విడత కింద మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఇళ్లను మంజూరు చేశారు. జిల్లాలోని 31 గ్రామాల పరిధిలో మొత్తం 2260 ఇళ్లను మంజూరు చేశారు. ఆ ఇళ్లకు అనుమతులను ఇవ్వడంతో పాటు లబ్ధిదారులను కట్టుకునే విధంగా ప్రోత్సహిస్తున్నారు. మొదటి విడత కింద 560 వరకు ఇళ్ల నిర్మాణం చేపట్టగా సుమారు 320 వరకు బేస్‌మెంట్‌లు పూర్తయ్యాయి. వీటికి సంబంధించిన బిల్లులను ప్రభుత్వానికి పంపించగా మొదటి విడత కింద 120 మంది లబ్ధిదారులకు వారి ఖాతాల్లో లక్ష రూపాయల వరకు డబ్బులను జమ చేశారు. మొదటి విడత కింద పనులు మొదలు కాగానే జిల్లాలో అన్ని నియోజకవర్గాల పరిధిలో మిగతా ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను రెండో విడత కింద చేపట్టారు. ఇప్పటి వరకు ఆరు నియోజకవర్గాల పరిధిలో 14వేల 295 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. బాల్కొండ నియోజకవర్గం పరిధిలో రెండవ విడత కింద 3324, బోధన్ 3156, నిజామాబాద్ రూరల్ 3229, ఆర్మూర్ 2987, నిజామాబాద్ అర్బన్ 752, బాన్సువాడ 777 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం పరిధిలో లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు డివిజన్ పరిధిలో గుర్తింపు చేయడంతో పాటు మంజూరుకు కసరత్తు చేస్తున్నారు.

మహిళా గ్రూపుల ద్వారా రూ.50వేల వరకు రుణం

జిల్లాలో రెండో విడత కింద అన్ని గ్రామాల పరిధిలో ఈ లబ్ధిదారులను ఎంపిక చేసినందున మండల స్థాయి అధికారుల ద్వారా పర్యవేక్షించడంతో పాటు ఇళ్ల నిర్మాణం కోసం ప్రోత్సహిస్తున్నారు. ఇసుకను ఉచితంగానే అందించడంతో పాటు అవసరం అయిన వారికి మహిళా గ్రూపుల ద్వారా 50వేల వరకు రుణం ఇచ్చే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల పరిధిలో మంజూరైన ఇళ్లను నిర్మాణం చేసే విధంగా ప్రోత్సహించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గృహ నిర్మాణ శాఖను పునరుద్ధరించడంతో పాటు కావాల్సిన స్టాఫ్‌ను కూడా భర్తీ చేస్తున్నారు. గతంలో ఇతర డిపార్ట్‌మెంట్లకు వెళ్లిన ఇంజనీర్లను కొంత మందిని వెనక్కి పిలిపించడంతో పాటు కొత్తగా మండల స్థాయిలో పర్యవేక్షించేందుకు ఔట్‌సోర్సింగ్ ద్వారా ఏఈలను భర్తీ చేశారు. వారిలో ఇప్పటి వరకు 10 మంది చేరగా మిగతా వారు కూడా ఈ వారంలోపు చేరనుండటంతో వారికి శిక్షణ ఇచ్చి ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో రెండో విడత కింద ఇళ్లు మంజూరు కాగా బోధన్ ఎమ్మెల్యే, సుదర్శన్ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. బోధన్ మండలం ఎరాజ్‌పల్లి, అమ్దాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల స్థలాలను పరిశీలించడంతో పాటు ముగ్గు పోశారు. జిల్లాలో మంజూరైన ఇళ్లను వెంటనే నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు కావాల్సిన సహాయ సహకారాలను అందిస్తున్నామని ఆయన తెలిపారు.

హనుమాన్ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీపోటీలు



మేడిపల్లి కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు

మోస్రా,మే14(ఆంధ్రజ్యోతి): చందూర్ మండలంలోని మేడిపల్లి గ్రామంలో వృషభ సంక్రమణం మాసం ప్రారంభం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు తెలిపారు. అదే విధంగా జాతర, కుస్తీపోటీలు ఏర్పాటు చేయగా పోటీలో పాల్గొనేందుకు జిల్లాలోని మల్లయోధులు పోటీలో పాల్గొన్నారు.గెలుపొందిన మల్లయోధుడికి నగదు బహుమతి ఇచ్చి సత్కరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ హనుమాన్ కమిటీ అధ్యక్షుడు రెడ్డి నాయక్, కారోబార్ గంగాధర్, నాయకులు, కారోబార్‌లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన



వెంచిర్యాల్‌లో భూమిపూజ చేస్తున్న మార్కెట్ కమిటి చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి

మోర్తాడ్, మే 14(ఆంధ్రజ్యోతి):మండలంలోని దోన్‌పాల్‌లోని 1994లో ఇందిరమ్మ పథకం కింద ఇచ్చిన ఇండ్ల పట్టాలకు అధికారులు స్థలాలు చూపించాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. సర్వే నెంబర్ 222 లో 80 ప్లాట్లు మంజూరు చేశారని పట్టాలు కూడా ఇచ్చారని, కాగా ఇంతవరకు లబ్ధిదారులకు ప్లాట్లు చూయించలేదని మహిళలు ఆరోపించారు. ఈ విషయంపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకోలేదని ఆరోపించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున ఇప్పటికైనా 80 మంది లబ్ధిదారులకు 222 సర్వే నంబర్‌లో ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు.ఈమేరకు తహసీల్దార్ కృష్ణకు వినతి పత్రం అందజేశారు. మాస్ లైన్ ప్రజాపంత ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగపోసాని,కిషన్ భూమగంగు, యమున, సాయమ్మ, లక్ష్మీ, బాజమ్మ, మొగుల్‌సాబ్, రాజు, గంగాధర్, సురేష్, నాయకులు పాల్గొన్నారు.

ముప్కాల్:ముప్కాల్ మండలంలోని వెంచిర్యాల్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లకు వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి లబ్ధిదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తుందని ఆయన అన్నారు. అనంతరం రెంజర్ల గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గణేష్‌ఆనంద్, పంచాయతీ సెక్రటరీలు, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి, సామరాజేందర్, నడుకుడ రాజారెడ్డి, బీసీసీ ఉపాధ్యక్షుడు చిన్నరెడ్డి, ఇందిరమ్మ కమిటి సభ్యులు, కాంగ్రెస్ కమిటి నాయకులు పాల్గొన్నారు.

పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోగలం

● టీయూసీఐ రాష్ట్ర నాయకులు మల్లేష్

కోటగిరి,మే14(ఆంధ్రజ్యోతి): పోరాటాల ద్వారానే కార్మికుల హక్కులను సాధించుకోగలమని టీయూసీఐ రాష్ట్ర నాయకులు బి.మల్లేష్ పేర్కొన్నారు రుద్రూరు మండల కేంద్రంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులతో గురువారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 139సంవత్సరాల క్రితం అమెరికాలోని చికాగో నగరంలో కార్మిక వర్గం రక్త తర్పణం చేసి 8గంటల పని దినాన్ని సాధిస్తే నేటి పెట్టుబడిదారి వర్గాలు 13గంటల పాటు కార్మికులు పని చేయాలని సూచించడం సిగ్గుచేటన్నారు. కార్మికులు అనేక త్యాగాలు చేసి సాధించుకున్న 29చట్టాలను నాలుగు కోడ్‌లగా మార్చి పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మికులను కట్టు బానిసలుగా మార్చివేసే విధంగా చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ నాయకులు లాలయ్య, బీడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు లత, యశోద, లక్ష్మి, శంకరమ్మ, అనిత, మౌనిక, జ్యోతి, శిరీషా, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

ఆర్మూర్‌రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): నరేంద్రమోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 20న చేయ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధానకార్యదర్శి పి. శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆర్మూర్ పట్టణంలోని ఐఎంఎ హాల్‌లో జిల్లా అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు బిన్నంగా కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి కార్మికులకు మరణశాసనం విధించిందని విమర్శించారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధా న కార్యదర్శి దాసు, ఉపాధ్యక్షుడు సూర్య శివాజీ, సహాయకార్యదర్శి శివ కుమార్, జేపీగంగాధర్,మల్లికార్జున్, బాలయ్య పాల్గొన్నారు.

'ఇసుక అక్రమ రవాణాపై ఆరోపణలు అవాస్తవం'

బోధన్‌రూరల్,మే14(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నియోజక వర్గ అభివృద్ధి కోసం, సంక్షేమ పథకాల అమలు కోసం, నిరుపేదలకు తక్కువ ధరకు ముడి సరుకు అందించడం కోసం కృషి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. బోధన్, సాలూర మండలాలలో అక్రమ ఇసుక రవాణాపై వస్తున్న ఆరోపణలు అవాస్తమని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ అన్నారు. బుధవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మండలంలో ఎమ్మెల్యే ఇసుక క్వారీలకు అనుమతి ఇవ్వడం వల్ల మండల రెవెన్యూ కార్యాలయాల్లో 3కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. ప్రభుత్వాన్ని బాద్నాయ్ చేయడానికి అసత్య ప్రచారం చేస్తున్నారని దీనిని ఖండిస్తున్నామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పది సంవత్సరాలు ఇసుక అక్రమ రవాణా జరిగిన నోరు మెదపని వారు ప్రస్తుతం రైల్వే లైన్‌లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం తక్కువ ధరకు ఇసుక రవాణా చేస్తుంటే వారు చూడలేక పార్టీపై, పార్టీ ముఖ్య నాయకులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. 6వేలకు పైగా ఉన్న ట్రాక్టర్ ఇసుక నేడు 3వేలకు దొరుకుతుందని, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే వారికి ఇది ఎంతో సౌకర్యవంతంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దాము, మాజీ వైస్ ఎంపీపీ ప్రకాష్ పటేల్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులున్నారు.

నందిపేట్‌లో శ్రీసీతారామ ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

ఆర్మూర్ రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి):నందిపేట మండల కేంద్రంలోని శ్రీరామ్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామ చంద్రస్వామి దేవాలయ యంత్ర, మూర్తి, శిఖరప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు బుధవారం ప్రారంభమ య్యాయి. మొదటి రోజున గణపతి పూజ, పుణ్యాహ వచనం, యాగశాల ప్రవేశం, అఖండ దీపస్థాపన, గణపతి హోమం, నవ గ్రహ హోమం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు యజ్ఞం, ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకేధారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు హాజరై పూజలు నిర్వహిం చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటి సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

దేవాలయాలు.. ఆధ్యాత్మికతకు నిలయాలు

● రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

కోటగిరి,మే14(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో దేవాలయాలు ఉంటే ఆధ్యాత్మికతకు నిలయాలుగా ఉంటాయని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. పొతంగల్ మండలంలోని సోంపూర్ గ్రామంలో బుధవారం పలు అభివృద్ధి పనులను రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. సుమారు 30లక్షల వ్యయంతో నిర్మించిన శివాలయాన్ని ప్రారంభించడంతో పాటు ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలయాలు ఉన్న చోట శుభం జరుగుతుందన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి కోట్లాది రూపాయలతో నిధులు మంజూరు చేశానని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు దైవ భక్తిని అలవర్చుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు భక్తిమార్గంలో నడవాలని ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలని సూచించారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ గొప్ప పోరాట యోధుడని కొనియాడారు. కుల, మతాలకు అతీతంగా పరిపాలన చేసిన మహనీయుడు ఛత్రపతి శివాజీ అని కొనియాడారు. రాజులకు గొప్ప పరిపాలన దక్షత ఉంటే ప్రజల చేత ఎన్ని శబ్దాలైన కీర్తించబడతారని అందుకు ఛత్రపతి శివాజీ గొప్ప ఉదాహరణ అని కొనియాడారు. వీరుడి ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం శివాలయం ప్రహరి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరగా ఆయన అంగీకరించారు. ప్రహరి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన లబ్దిదారులు నిర్మించుకోవాలని సూచించారు, సోంపూర్ గ్రామానికి 58ఇళ్లను మంజూరు చేశామన్నారు. ఇంటికి 5లక్షల రూపాయల చొప్పున ప్రభుత్వం వివిధ దశలలో అందిస్తుందని, లబ్దిదారులు ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శంకర్ పటేల్, మాజీ ఎంపీపీ పవన్, నాయకులు ఏజాజ్ ఖాన్, చాకూర్ గంగాధర్, నాగరాజు గౌడ్, శివరాజ్ పటేల్, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు మృతి



ప్రమాదం జరిగిన తీరును పరిశీలిస్తున్న ఎస్‌హెచ్‌వో

ఆర్మూర్ టౌన్, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేపూర్ గ్రామ శివారులో 63వ జాతీయ రహదారిపై పట్టణంలోని దోభిగల్లికి చెందిన కొండూర్ నాగార్జున(22), కొండూర్ నరేంద్ర(20) బుధవారం రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందారు. మెట్‌పల్లి మండలం పెద్దపూర్ గ్రామంలోని మేనత్త ఇంటివద్ద గల ఓ ఫంక్షన్ ముగించుకొని బుధవారం ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా మెట్‌పల్లి వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వాహనం పై గల ఇద్దరు అన్నదమ్ములు నాగార్జున, నరేంద్రలు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లి కొండూర్ పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● దోభీగల్లిలో మిన్నంటిన రోదనలు

హైదరాబాద్‌లో ఏసీ మెకానిక్‌గా కొండూర్ నాగార్జున పనిచేస్తుండగా అతడి తమ్ముడైన నరేంద్ర హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సును పూర్తి చేశారు. త్వరలో మంచి ఉద్యోగం వస్తుందనుకుంటే మృత్యువు కాటేయడంతో స్నేహితులు , కాలనీవాసులు రోదనలు మిన్నంటాయి. ఐదేళ్ల కిందట భర్తను కోల్పోయిన కొండూరు పద్మ బుధవారం ఇద్దరు కుమారులను కోల్పోవడంతో పలువురికి కన్నీరు పెట్టించింది. దోభీగల్లిలో నివాసం ఉండే ఇద్దరు అన్నదమ్ములు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.

రహదారుల వెంట నాటిన బురుగు చెట్లతో ప్రమాదాలు

● బూరుగు చెట్లను తొలగించి ప్రమాదాలను నివారించాలని కోరుతున్న వాహనదారులు



హసాకొత్తూర్ గ్రామశివారులో ఉన్న బురుగు చెట్టు



కాయలు కిందపడి పగిలి బయటపడిన దూదిలాంటి పదార్థం

కమ్మర్‌పల్లి, మే 14: (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం హరితహారం పథకంలో భాగంగా రహదారుల వెంట నాటిన బురుగు చెట్లు ప్రమాదాలకు దారితీస్తున్నాయి. చెట్లుకు కాసిన కాయలనుండి దూదిలాంటి మెత్తటి పదార్థాం బయటకు వచ్చి రహదారుల పైవెలుతున్న వాహనదారుల కళ్లలోపడి ప్రమాదాలకు దారితీస్తున్న సపంఘటనల దృష్ట్యి రహదారులవెంబడి నాటిన బురుగు చెట్లను తొలగించి వాటి స్థానంలో వేరే మొక్కలు నాటించాలని కోరుతున్నారు. ఈ బురుగు చెట్లకు కాసిన కాయలు ఎండలకు పగిలి అందులోని దూది గాలికి ఎగిరి వాహనదారుల కల్లలో పడి ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. అదీకాక చెట్లు ఎత్తుపెరిగి విద్యుత్ వైర్లకు తాకి గాలిదుమారం వీచిన సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నాయి ఈ విషయమై మండలంలోని చౌట్‌పల్లి వద్ద స్థానిక గ్రామపంచాయితి, విద్యుత్ సిబ్బంది చెట్ల కొమ్మలు తొగించడంతో అటవిశాఖ స్బిబ్బంది అధికారులతో వాగ్వివాదనికి దిగిన సంఘటన ఇటివల వెలుగు చూసింది. అయితే ఈ బురుగు చెట్లు కమ్మర్‌పల్లి నుండి భీమ్‌గల్ వెల్లే రహదారులు, జాతీయర హదారి వెంబడి ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకశాలు ఉన్నాయని వాటిని తొలగించి వాటి స్థానంలో వేరేరకం మొక్కలు నాటి ప్రమాదాలను నివారించాలని ఆయ గ్రామాల స్థానికు, వాహనదారులు కోరుతున్నారు.

నేడు జీలుగ విత్తనాల పంపిణీ

ఎడపల్లి, మే14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ, సహకార సంఘం ద్వారా 50 శాతం సబ్సిడీతో జీలుగ విత్తనాలను నేడు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి సిద్ద రామేశ్వర్ తెలిపారు. ఎడపల్లి సహకార పరపతి సంఘం ఎడపల్లి నందు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, 30కిలోల బస్తా 4275.00 రూపాయలకు గాను 50 శాతం సబ్సిడీ 2138.00 రూపాయలను ప్రభుత్వం భరించడంతో రైతు ఒక బస్తాకు 2138.00రూపాయలు చెల్లించాలని తెలిపారు. 167 బస్తాలు అందుబాటులో ఉన్నాయని కావలసిన రైతులు తమ పట్టా పాస్‌బుక్‌తో పాటు ఆధార్ కార్డు తీసుకొచ్చి డబ్బులు చెల్లించి జీలుగ విత్తనాలు తీసుకెళ్లాలని కోరారు. 5 ఎకరాలకు రెండు బస్తాలు, రెండున్నర ఎకరాలకు ఒక బస్తా మాత్రమే ఇవ్వబడుతుందని రైతులు గమనించాలన్నారు. ఒక రైతుకు రెండు బస్తాలు మాత్రమే పరిమితి ఉందన్నారు.

కోటగిరిలో..

కోటగిరి: మండలంలో రైతులకు గురువారం నుంచి 50శాతం రాయితీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు కోటగిరి మండల వ్యవసాయ అధికారి రాజు తెలిపారు. కోటగిరి, కొత్తపల్లి, ఎత్తొండ సహకార సంఘాలలో ఉదయం 10గంటల నుంచి విత్తనాల పంపిణీ ప్రారంభిస్తామన్నారు. జీలుగ విత్తనాలు 30కిలోల బస్తా 4275రూపాయలు కాగా 50శాతం సబ్సిడీ పోనూ 2138రూపాయలు రైతులు చెల్లించాలని ఆయన సూచించారు. కోటగిరిలో 100బస్తాలు, కొత్తపల్లిలో 30బస్తాలు, ఎత్తొండలో 30బస్తాలు అందుబాటులో ఉన్నాయని, విత్తనాలు అవసరమైన రైతులు పట్టాపాస్ బుక్, ఆధార్ కార్డు తీసుకువచ్చి విత్తనాలు తీసుకోవాలని సూచించారు.

నవీపేటలో..

నవీపేట:నవీపేట సొసైటీలో గురువారం సబ్సిడీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతుందని సొసైటీ చైర్మన్ అబ్బన్న తెలిపారు. నవీపేట సొసైటీలో 333 సంచుల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. 30కిలోల బరువు ఉన్న ఒక్కొక్క జీలుగ బస్తాను 50శాతం సబ్సిడీతో రూ.2137.50లకు అందజేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రెండున్నర ఎకరాల విస్తీర్ణానికి ఒక బస్తాను అందించడం జరుగుతుందని ఆయన వివరించారు. రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్‌తో పాటు ఆధార్ జిరాక్స్‌ను వెంట తీసుకువచ్చి జీలుగ విత్తనాలను పొందాలని ఆయన కోరారు.

పంచాయతీ కార్మికుల సమ్మె నోటీసు అందజేత



ఎంపీడీవోకు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

కోటగిరి,మే14(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ కార్మికులు బుధవారం ఎంపీడీవో చందర్‌కు తమ సమ్మె నోటీసు అందజేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ప్రజా వ్యతిరేక కార్పొరేట్ అనుకూల విధానాలు మానుకోవాలని జీపీ వర్కర్స్ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి లింగం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మే 20వ తేదిన దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నన్నేసాబ్, రజిని, లింగవ్వ, సాయవ్వ, లక్ష్మీ, నాగమణి పాల్గొన్నారు.

గుండెపోటుతో యువరైతు మృతి

ఆర్మూర్ రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): నందిపేట మండలం బాద్గుణ గ్రామానికి చెందిన యువరైతు గోడిసెర తిరుపతిరెడ్డి (38) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఉదయం తన ఇంటివద్ద నీటిడ్రమ్మును కదుగుతున్న సమయంలో గుండె పోటు రావడంతో కుప్పకూలీ పడిపోయాడు. కుటుంబ సభ్యులు వచ్చి గమనించగా అప్పటికే తిరుపతిరెడ్డి మృతిచెందాడు. కొన్నేళ్ల క్రితం ఆయన కూతురు స్కూల్‌బస్సు కిందపడి మృతిచెందింది. ఈయనకు భార్య , పిల్లలు ఉన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

నవీపేట,మే14(ఆంధ్రజ్యోతి): మండల రెవెన్యూ కార్యాలయంలో బుధవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రాజీవ్ యువ వికాసం వంటి వివిధ సంక్షేమ పథకాలపై అధికారులకు కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మల్లికార్జున్, తహసీల్దార్ వెంకట రమణ, ఎంపీడీవో నాగనాథ్, పలువురు మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అల్లుకున్న పచ్చదనం



వేల్పూర్ వెళ్లే రోడ్డులో సాయిబాబా ఆలయం వద్ద అల్లుకున్న వృక్షాలు

వేల్పూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం అమీనాపూర్ గ్రామ సమీపంలో సాయిబాబా ఆలయం వద్ద ఆర్మూర్, భీమ్‌గల్ వెళ్లే రహదారుల్లో రెండువైపుల నాటిన మొక్కలు ప్రస్తుతం వృక్షాలుగా ఎదిగాయి. రోడ్డుకు రెండు దిక్కుల నుంచి చెట్లకొమ్మలు అల్లుకుపోవడంతో అహ్లాదకరంగా మారి పచ్చని తోరణంల కనబడుతుంది. ఈ దృష్యం రోడ్డున వెళ్లే వాహనదారులను ఆకట్టుకుంటుంది. ఈ దృష్యాన్ని చూసిన వారు తమ ఫోన్‌లలో బంధించుకుంటున్నారు. దారిపొడవున ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు చల్లని నీడ ఉండడంతో ప్రయాణీకులు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందడానికి కాసేపు ఆగి సేదతీరుతున్నారు.

మార్కెట్ యజమాని ఖాదర్‌యూసిఫ్‌ను కలిసిన డైరెక్టర్లు

జక్రాన్‌పల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో బుధవారం ప్రపంచ ప్రఖ్యాత రిటైర్డ్ మార్కెట్‌కు చెందిన లల్లుమార్కెట్‌ను జేఎంకేపీఎం డైరెక్టర్లు సందర్శించారు. అనంతరం ప్రధాన మేనేజర్ ఖాదర్‌యూసిఫ్‌ను కలిసిన జేఎంకేపీఎం చైర్మన్ తిరుపతిరెడ్డి, గౌవర అధ్యక్షుడు ములుగు హిమగిరిరావు కలిశారు. రైతుల ఉత్పత్తిదారుల సంఘంలో విలువ ఆధారిత పసుపును లల్లుమాల్ ద్వారా మార్కెటింగ్ చేసే అవకాశం కల్పించాలని కోరారు. దీనికి స్పందించిన ఖాదర్‌యూసిఫ్ రైతులు తయారు చేసే వస్తువు నాణ్యమైనదిగా ఉంటుందని ఈ విషయాన్ని యజమానికి వివరించి త్వరలో రైతుల ఉత్పత్తుతిదారుల సంఘ పరిశ్రమను సందర్శించిన నిర్ణయం తీసుకుంటామని రైతులు పండించిన పసుపు ద్వారా తీసిన కల్తీలేని నాణ్యమైన పసుపు పౌడర్‌ను కొనడానికి త్వరలో నిర్ణయం తీసుకుంటామని ఖదర్ యూసఫ్ భరోసా ఇచ్చారని జేఎంకేపీఎం చైర్మన్ తిరుపతిరెడ్డి తెలిపారు.

బాల్కొండలో రైతులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రమ్యరాథోడ్

బాల్కొండ, మే 14(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల కేంద్రంలో బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రూర్ ప్రాంతీయ వరిపరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రమ్యరాథోడ్ రైతులకు పలు అంశాలపై శాస్త్రీయ మార్గదర్శనం చేశారు. పంటల సాగులో యూరియా, రసాయనిక ఎరువుల తక్కువ వినియోగం, భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం, అవసరమైన సమయంలో సూచించిన మోతాదులో పురుగుమందులను వినియోగించాలని దీనివల్ల నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. పంట మార్పిడి విదానం ద్వారా నేల సారాన్ని మెరుగు పర్చడంతో పాటు పర్యావరణ సమతూల్యత సాధ్యమవుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ రోహిత్‌రెడ్డి, వ్యవసాయాధికారిణి లావణ్య, డాక్టర్ లక్కం ప్రభాకర్, సతీష్, రేష్మ, నిహారిక, రైతులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి

● అఖిల భారత ఐక్యరైతు సంఘం నాయకుల డిమాండ్



అర్గుల్‌లో ధాన్యం కుప్పలను పరిశీలిస్తున్న రైతు సంఘ నాయకులు

జక్రాన్‌పల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రధాన రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం పేరుకుపోయాయని తక్షణమే ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వేగవంతం చేయాలని అఖిలభారత ఐక్యరైతు సంఘం రాష్ట్ర నాయకుడు వి. ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని అర్గుల్, సికింద్రాపూర్ గ్రామాలలో ఎటుచూసిన రోడ్లపై నిల్వఉన్న ధాన్యం కుప్పలను అఖిలభారత ఐక్యరైతు సంఘం ప్రతినిధులు, నిజామాబాద్ రూరల్ కామారెడ్డి సంయుక్త జిల్లా కమిటీ ప్రతినిధులు వి. ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. దేవరాం, కార్యదర్శి సురేష్, జిల్లా అధ్యక్షుడు బాబాన్న, నాయకులు డి. కిషన్, వాల్గోట్ సాయిలు, గంగారాం, బాలయ్య ఈ గ్రామాలలో పర్యటించి ధాన్యం కుప్పలను పరిశీలించారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి రైతులకు ఇబ్బందులు కలుగకుండా తక్షణమే ధాన్యం కొనుగోలు చేపట్టాల న్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కురుస్తున్న అకాల వర్షాలకు తడిసి ముద్దయితున్నాయని, వర్షపు నీటి కాలువలలో ధన్యం కొట్టుకుపోతుందని అన్నారు. ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించకపోతే పెద్ద ఎత్తున రైతుల తరపున ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు జగదీష్, గంగారాం, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో దరఖాస్తులకు ఆహ్వానం

రెంజల్,మే14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ రెసిన్షియల్ పాఠశాల, కళాశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు బాలికల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హర్షియా నాజం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలకు, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్ దరఖాస్తులను జూన్ 1వ తేది వరకు, 5వ తరగతి ప్రవేశాలకు మే 31వరకు చివరి తేది అని, దరఖాస్తులతో పాటు విద్యార్థిని, తల్లిదండ్రుల ఆధార్ కార్డు జిరాక్స్, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆదాయ, కుల ధ్రువపత్రాలు, టీసీ, ప్రోగ్రెస్ కార్డు, బోనోఫైడ్, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికేట్ జత పర్చాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

మగ్గిడి ఎత్తిపోతల కమిటీ నూతన కార్యవర్గం

ఆర్మూర్ రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలంలోని మగ్గిడి, ఖానాపూర్, అమ్దాపూర్ గ్రామాలకు చెందిన రాజీవ్‌గాంధీ ఎత్తిపోతల పథకం నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా బద్దం నాగరాజు, వైస్ చైర్మన్‌గా తౌడుశెట్టి సుమన్, కోశాధికారిగా అశోక్, కార్యదర్శిగా నలిమెల చిన్నారెడ్డి, డైరెక్టర్లుగా భూమారెడ్డి, దినేష్, రాజేశ్వర్, రాజన్న, నర్సయ్య ఎన్నిక కాగా వారు ప్రమాణ స్వీకారం చేశారు.

సొంతంగా ఆలయం నిర్మించుకోవడం అభినందనీయం



మాజీ జడ్పీ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటి సభ్యులు

ఆర్మూర్ రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): నందిపేట మండల కేంద్రం లోని శ్రీరామ్‌నగర్ కాలనీలో భక్తులు, కాలనీవాసులు, గ్రామస్థులు సొంతంగా ఆలయం నిర్మించుకోవడం అభినందనీ యమని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాజన్నగారి విఠల్‌రావు అన్నారు. బుధవారం నందిపేట్‌లో శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠమహోత్సవానికి హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నో ఆలయాలకు ఎండోమెంట్ ద్వారా నిధులు మంజూరు చేయడం జరిగిందని కానీ శ్రీరామ్‌నగర్ కాలనీవాసులు ఎండోమెంట్ నుంచి ఏమి ఆశించకుండా సొంతంగా డబ్బులు జమచేసుకుని ఆలయ నిర్మాణం పూర్తిచేసుకోవడం గొప్ప విషయం అన్నారు. ఈ సందర్భంగా దాదన్నగారి విఠల్‌రావును ఆలయ కమిటి సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రమణారెడ్డి, సిలిండర్ లింగం, మచ్చర్ల సాగర్, వార్డుమెంబర్ భూమేష్, ఎలిగేటి రాజు, మంద సాయన్న, నారాయణ పాల్గొన్నారు.

బెజ్జోర ఆలయంలో ఇటాలీ సైనికుల బ్యాడ్జీలు లభ్యం

భీమ్‌గల్ రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ మండలంలోని బెజ్జోర గ్రామంలో ఉన్న పురాతన బెజ్జమహాదేవి ఆలయంలో రెండో ప్రపంచ యుద్ధ కాలం నాటి ఇటాలీ దేశానికి చెందిన సైనికుల బ్యాడ్జీలు లభ్యమైనట్లు ప్రముఖ చరిత్ర పరిశోధకుడు కంకనాల రాజేశ్వర్ తెలిపారు. బుధవారం ఆయన ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ఒక పక్కన పెట్టిన ఉన్న రెండు బ్యాడ్జిలను గుర్తించారు. అవి ఇటాలీయన్ సైన్యంలోని కెప్టెన్‌ల బ్యాడ్జిలని ఒకటి (ఆర్డినరి రెజిమెంట్ ఫిట్ హెల్మెంట్)గా, రెండోది (ఇటాలి బెటాలియన్ ఆర్మీక్యాంప్ బ్యాడ్జి)గా గుర్తించారు. తెలం గాణ రాష్ట్ర పురావస్తు శాఖ అధికారులు ఈ ఆలయాన్ని సందర్శించి వివ రాలు సేకరించి ఈ బ్యాడ్జిలను మ్యూజియంలో భద్రపరచాలని ఆయన కోరారు.



బెజ్జోర ఆలయంలో లభ్యమైన ఇటాలీయన్ బ్యాడ్జిలు



చెట్టు కింద సేద తీరుతున్న గొర్రెలు, మేకలు

ఎండకు అల్లాడుతున్న మూగజీవాలు

● వడదెబ్బ తగిలే అవకాశం

● అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారుల సూచన

డొంకేశ్వర్, మే 14 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు ఎండలో ముదురుతున్నాయి. ఎండ తీవ్రతను మనుషులే కాకుండా మూగజీవాలు అల్లాడుతున్నాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్న మనుషలకు ఎండదెబ్బ తగులుతుంది. అలాంటిది బయట మేతకోసం పశువులు గొర్రెల మేకలతో పాటు పక్షులు ఎంత అల్లాడుతున్నాయో చెప్పనక్కర్లేదు. మేత కోసం అడవికి వెళ్లిన పశువులు గొర్రెలు, మేకలకు వాగులు చెరువుల్లో నీరు అడుగంటి బోసి పోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఎండ ప్రభావంతో చెరువుల నీళ్లు వేడెక్కి ఉంటాయి. అవే నీటిని పశువులు తాగుతాయి. ఎండ కాలంలో తీవ్రమైన ఎండల వల్ల పశువులు అధిక వేడి తాపానికి గురై ఉత్పాదక శక్తి కోల్పోవడమే కాకుండా కొన్ని సందర్భాల్లో మరణం కూడా సంభవించే అవకాశం ఉంటుంది. దీంతో పశువులకు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని పశువైద్య అధికారులు సూచిస్తున్నారు. డొంకేశ్వర్ మండల వ్యాప్తంగా గేదెలు 5500, ఆవులు 700, గొర్రెలు 17000, మేకలు 5500 ఉన్నాయి. వేసవిలో తప్పనిసరి పశువులకు మూగజీవాల పెంపకందారులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు. ఒకవేళ పశువులు, గొర్రెలు, మేకలు ఎండ ప్రభావానికి ఎండదెబ్బకు గురై వాటి శరీరం వేడిగా పొడిబారి ఉంటుంది. వెంటనే తడిబట్టతో తుడవాలి లేదా తడి బట్టతో కప్పి ఉంచాలి. ఆరోగ్యం క్షీణిస్తే వెంటనే పశువైద్య సిబ్బందిని సంప్రదించి వైద్యం అందిస్తే త్వరగా కోలుకునే అవకాశం ఉంది.

నీరు, పశుగ్రాసం అందుబాటులో ఉంచాలి ..

పశువులు మూగజీవాలకు వేసవిలో రెండు పూజలా నీటిని తాగించాలి. సుమారు రోజుకు 50 లీటర్ల వరకు నీటిని తాగించాలి. పుష్కలంగా నీరు తాగించడం వల్ల డిహైడ్రేషన్‌కు గురి కాకుండా కాపాడుకోవచ్చు. నీరుతో పాటు పచ్చిమేత అందించాలి. పంటచేలకు వెళ్లే పశువులు మధ్యాహ్నం సమయంలో చెరువులు కుంటలో నీరు తాగించడం మంచిది కాదు. ఎండ వేడికి నీరు వేడెక్కి ఉండటంతో వేడినీరు తాగడం వల్ల మూగ జీవాలు పశువుల ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉంది. చల్లని నీటిని మాత్రమే తాపాలి. ఎండవేడికి కొట్టాలలో చెట్ల నీడన సేదతీరే విధంగా చూడాలి. గొర్రెలు, మేకలు, గేదెలు , ఆవుల ఎక్కువగా ఎండలో తిప్పకూడదు. వీలైనంత వరకు చల్లని ప్రాం తాల్లో నీడ పట్టున ఉంచాలి. ఇంటి వద్ద రేకుల షెడ్డు ఉన్నవారు పైన వరిగడ్డి ఉంచితే వేడి ప్రబావం తగ్గుతుంది. పశువులకు పచ్చిమేత ఎకుకవగా ఇంటివద్ద అందించేలా ఏర్పాటు చేసు కోవాలి. బయటకు తీసుకెళ్లడం త్పనిసరి అయితే ఉదయం 6 నుంచి సాయంత్రం 10 గంటల లోపు తీసుకెళ్లాలి. మళ్లీ సాయంత్రం 5 దాటిన తరువాత మరోసారి మేతకు తీసుకువెళ్లాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి

● శ్రీకాంత్, పశువైద్యాధికారి, డొంకేశ్వర్



ప్రస్తుతం గతంలో ఎన్నడు లేని విధంగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. పెరుగుతున్న ఎండల తీవ్ర తతో వివిధ పశువుల పెంపకందారులు జాగ్రత్తలు పాటించాలి. సరైన సమయంలో నీరు పశుగ్రాసం అందించేలా చూడాలి. పశువుల చుట్టూ చల్లని వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలి.

స్టేట్ లెవెల్ సబ్ జూనియర్ నెట్‌బాల్ పోటీలకు

తాడ్‌బిలోలి విద్యార్థుల ఎంపిక

రెంజల్, మే 14 (ఆంధ్రజ్యోతి): యంగ్ ఇండియా చాంపియన్-2025 రూపొందించిన తెలంగాణ క్రీడ సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ నెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ నెట్ బాల్ పోటీలు జనగామలో నిర్వహించనున్న పోటీలకు తాడ్‌బిలోలి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు నయనశ్రీ, అక్షయ, శృతి, అమర్, మహేష్ విద్యార్థులు పోటీలలో ఈ నెల 15నుండి 17వ తేది వరకు నిర్వహించే స్టేట్ లెవెల్ పోటీలలో పాల్గొనన్నుట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేఖ తెలిపారు. స్టేట్ లెవెల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు రేఖతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.



చెరువు ముందర తండా రహదారి ఇదే



శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దృశ్యం



కాంట్రాక్టర్ కల్వర్టుల నిర్మాణం కోసం తీసుకువచ్చిన పైపులు వృథాగా ఉన్న దృశ్యం

ఫోకస్

ఏళ్లు గడుస్తున్నా..

ముందుకు సాగని రహదారుల నిర్మాణం

● ఫారెస్టు క్లియరెన్స్ రాదు.. రోడ్డు నిర్మాణం జరగదు ● మారుమూల తండాల రహదారులను పట్టించుకోని అధికారులు, పాలకులు

నిజాంసాగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): మారుమూల గిరిజన తండాల రహదారుల నిర్మాణాలకు ఫారెస్ట్ క్లియరెన్స్ రాకపోవడంతో తండాల రహదారుల నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా ముందుకు సాగటం లేదు. ఫారెస్ట్ అధికారులు ఫారెస్ట్ హద్దులను ముందుగానే నిర్ధారణ చేసుకున్నప్పటికీ రహదారుల నిర్మాణం పనులు శ్రీకారం చుట్టిన పనులు ముందుకు సాగకుండా అడ్డుకున్నారు. ఫలితంగా లక్షల రూపాయలు మంజూరు చేసినా ప్రభుత్వం రహదారి నిర్మాణాల వైపు కన్నెత్తి చూడటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. నిజాంసాగర్ మండలం, వడ్డేపల్లి శివారు గ్రామమైన చెరువు ముందర తండాకు వెళ్లే ప్రధాన రహదారిని బీటీ రోడ్డుగా మార్చేందుకు 2017లో తెలంగాణ ప్రభుత్వం పరిపాలనా నిధుల కిందట 78 లక్షల రూపాయలను మంజూరు చేసింది. ఈ పనులు చేపట్టేందుకు అప్పట్లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసింది. ఈ నిర్మాణం నిజామాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ పనులను చేజిక్కించుకున్నారు. ప్రధాన రహదారి నుంచి దాదాపు 2.5 కిలోమీటర్ల దూరం రహదారిని ఫార్మేషన్ చేయడంతో పాటు వీటిలో నిర్మాణం కూడా చేసేందుకు అగ్రిమెంట్ పూర్తి చేసుకున్నారు. ఈ రహదారి పనులు చేపట్టేందుకు పంచాయతీరాజ్ అధికారులు అప్పటి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతులమీదుగా శంకుస్థాపన చేయించారు. 2017లో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ కల్వర్టుల నిర్మాణానికి పైపులతో పాటు ముడి సరుకులు కూడా సమకూర్చుకున్నారు. రహదారిని వెడల్పు చేసేం దుకు కాంట్రాక్టర్ అడవి జాతుల చెట్లను తొలగించి రోడ్డును వెడల్పు చేసేందుకు పనులను ప్రారంభించారు. ఈ రహదారి అటవీ సరిహద్దులో ఉందంటూ అటవీశాఖ అధికారులు అడ్డ తగిలి పంచాయతీరాజ్ శాఖ అధికారులకు నోటీసులు జారీ చేశారు. అటవీ అనుమతులు లేనిది పనులు చేయరాదంటూ నోటీసులో హుకుం చేశారు. దీంతో పనులు చేపట్టే కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు. 2017 నుండి 2025 వరకు ఫారెస్ట్ క్లియరెన్స్ రాకపోవడంతో రహదారి నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారింది. మల్లూరు ప్రధాన రహదారి నుంచి చెరువు ముందర తండాకు వెళ్లే రహదారి ఇరుకుగా ఉండడంతో తండావాసులు అనేక పాట్లు పడుతున్నా పాలకులు, ప్రజాప్రతినిధులు పట్టించుకునే పాపాన పోవటం లేదని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం పాలనా పరిపాలన నిధుల కిందట 78 లక్షల రూపాయలు కేటాయించిన రోడ్డు నిర్మాణం పనులను ముందుకు సాగడానికి ఎలాంటి చర్యలు చేపట్టలేకపోతున్నారని తండావాసులు ఆరోపిస్తూ ఉన్నారు. రహదారి నిర్మాణానికి 2017లో పంచాయతీరాజ్ మంత్రి వేసిన శిలాఫలకాన్ని రోడ్డు నిర్మాణం జరగటం లేదని ఆగ్రహంతో ప్రజలు శిలా ఫలకాన్ని ధ్వంసం చేశారు రోడ్డు నిర్మాణంలో భాగంగా చేపట్టనున్న కల్వర్టుల నిర్మాణానికి తీసుకువచ్చిన పైపులు రహదారి వెంటనే నిరు పయోగంగా పడి ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా గిరిజన తండా రహదారికి ఫారెస్టు క్లియరెన్స్ వచ్చేనా రహదారి నిర్మాణం జరి గినానీ ప్రశ్నర్థకంగా మారింది. ఇప్పటికైనా పాలకులు, సంబంధిత అధి కార యంత్రాంగం గిరిజన తాండాల రోడ్డు నిర్మాణం పనులను చేప ట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వెట్టి చాకిరి ఇంకెన్నాళ్లు!?

● 20 ఏళ్లుగా కాంట్రాక్టు ప్రతిపాదికన కొనసాగుతున్న రెండో ఏఎన్ఎంలు

● చాలీచాలనీ జీతాలతో జీవితాలు నెట్టుకొస్తున్న వైనం ● రెగ్యులరైజ్ కోసం ఎదురు చూపులు

నసురుల్లాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 20 ఏళ్లుగా కాంట్రాక్టు ప్రతిపాదికన పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. ఉద్యోగ భద్రత లేక చాలీచాలని వేతనాలతో జీవితాలను నెట్టుకొస్తున్నారు. దశలవారీగా ఉద్యోగాలను క్రమబద్ధీకరించాల్సి ఉండగా పట్టించుకునే వారే కరువయ్యారు. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ఆరోగ్య ఉప కేంద్రాల్లో, ఆరోగ్య కేంద్రాల్లో రెండో ఏఎన్ఎంలను కాంటాక్టు పద్ధతిన నియమించారు. నాటి నుంచి 20 ఏళ్లు గడుస్తున్నా నేటి వరకు రెండో ఏఎన్ఎంలు రాష్ట్ర జిల్లా స్థాయిలో నిరసనలు తెలుపుతున్న ప్రభుత్వాలు మాత్రం స్పందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నాలుగు గ్రామాలు ఉంటే రెండు గ్రామాలు రెగ్యులర్, మరో రెండు గ్రామాల బాధ్యతలను కాంట్రాక్టు కేటాయించారు. కాగా వీరి మధ్య వేతన వ్యత్యాసం చాలా ఉంది. తమకు నెలకు అందిస్తున్న 28 వెల రూపాయల వేతనం సరిపోవడం లేదని, రెండో ఏఎన్ఎంలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించి, రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నారు.



ఇంటికెళ్లి బాలింతలకు వైద్య సేవలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



గర్భిణుల వద్ద నుంచి వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది



మిర్జాపూర్‌లో వైద్య సేవలు నిర్వహిస్తున్న ఏఎన్ఎం

● ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యులర్ చేయాలి



ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యులర్ చేయాలని కొన్ని సంవత్సరాలుగా ఆందోళనలు చేస్తున్నప్పటికీ అధికారు లు స్పందించడం లేదు. సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు మమ్మల్నీ గుర్తించి రెగ్యులర్ చేయాలి.

- శిరీష, ఏఎన్ఎం, మిర్జాపూర్

● సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



కాంట్రాక్టు రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేస్తామని ప్రభుత్వాలు హామీలు ఇస్తున్నా అవి అమలు కావడం లేదు. కనీసం సమాన పనికి సమాన వేతనం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి.

- స్రవంతి, ఏఎన్ఎం, నెమ్లి

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

● గ్రామాల్లో సమస్యలతో సతమతమవుతున్న ప్రజలు ● సమయపాలన పాటించని పంచాయతీ కార్యదర్శులు ● పర్యవేక్షించని ఉన్నతాధికారులు



పొందుర్తి మురికి కాలువలో పేరుకుపోయిన చెత్తా చెదారం



ఆంధ్రజ్యోతి పరిశీలన



శివాయిపల్లి గ్రామంలో మురికికాలువల దుస్థితి

రాజంపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. మండలంలోని అనేక గ్రామాల్లో సమస్యలతో ప్రజలు సతమతమవు తున్నారు. మండలంలోనే పలు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు సమయ పాలన పాటించకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. వేసవి కాలం వచ్చిందంటే గ్రామాల్లో మంచినీటి కొరత ఉండడం సహజమే అయినప్పటికీ కొన్ని గ్రామాల్లో అన్ని సౌకర్యాలు ఉన్న సిబ్బంది నిర్లక్ష్యం వల్ల నీళ్లు అందడం లేదు. మధ్యాహ్నం దాటితే పలువురు పంచాయతీ కార్యదర్శులు అసలు గ్రామపంచాయతీ పరిధిలో కనిపించడం లేదని పేర్కొంటున్నారు. సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు తీర్చేలా ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉన్న పట్టించుకోకపోవడంతో సిబ్బంది తమకు నచ్చిన విధంగా వ్యవహరిస్తున్నారని దీంతో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అటకెక్కిన పారిశుధ్య నిర్వహణ

మండలంలోని ఆయా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అటకెక్కింది. పారిశుధ్య పనులు చేపట్టిన చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించక పోవడంతో ఎక్కడ చెత్త అక్కడే దర్శనమిస్తుంది. నిర్వహణలోపించడంతో గ్రామాల్లో మురుగు ఏరులై పారుతుంది. ఒకప్పుడు వార్డులలో పెంట కుప్పలు ఉండడంతో ఈదురుగాలలు వచ్చినప్పుడు ఇండ్లలోకి చెత్త వచ్చేదని ఇప్పుడు డంపింగ్‌యార్డు ఉన్న కొన్ని వార్డులలో పెంటకుప్పలు దర్శనమిస్తున్నాయి. గ్రామపంచాయతీ ట్రాక్టర్లు సమయానికి రాకపోవడంతో ఇంట్లో ఉన్న చెత్త వీధుల్లో పెద్ద కుప్పలల్లో వేస్తున్నారు. మండలంలోని శివాయిపల్లి, పొందుర్తి గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో మురికికాలువలు, చెత్తచెదారంతో నిండిపోయి కంపుకొడుతున్నాయి. గ్రామాల్లో దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలలో మురికికాలువలు శుభ్రం చేయకపోవడంతో గడ్డిఏపుగా పెరిగి అందులో దోమలు ప్రమాదకరమైన విషపురుగులు దర్శనమిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● సమయపాలన పాటించని పంచాయతీ కార్యదర్శులు

గ్రామాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలు అందించాల్సిన పలువురు పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదయం ఎప్పుడు వస్తున్నారో ఎప్పుడు వెళ్తున్నారో తెలియడం లేదని ఏదైన పని కోసం గ్రామస్థులు కార్యాలయానికి వస్తే అందుబాటులో ఉండడం లేదు. ఒకవేళ ఫోన్ ద్వారా సంప్రదిస్తే మండల కార్యాలయంలో పనుల కోసం వచ్చామని చెబుతున్నారని వాపోతున్నారు. మధ్యాహ్నం దాటితే కార్యాలయంలో ఏ ఒక్క పంచాయతీ కార్యదర్శి ఉండడంలేదని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాలలో సమస్యలు ఏర్పడితే సర్పంచ్‌లు లేకపోవడం వల్ల ఎవరికి చెప్పుకోవాలో అర్థంకావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామాలలో ప్రజలకు ప్రభుత్వం అందించే పథకాలపై అవగాహన లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులను కలిసేందుకు వెళ్తె కారోబార్‌లు ఉండడం వారు తమకు అంతగా తెలియదని సమాధానం ఇస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉదయం వచ్చి రెండు గంటలు కాలక్షేపం చేసి వెళ్లిపోతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కార్యదర్శుల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండడంతోనే ఎవరికి నచ్చినట్లుగా వారు వ్యవహరిస్తున్నారని దీంతో ప్రజాసమస్యలు తీరడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం..

● రఘురాం, ఎంపీడీవో, రాజంపేట



మండలంలోని గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిపెడుతున్నాం. ప్రతిరోజు మురికికాలువలను శుభ్రం చేయిస్తున్నాం. ఎవరైనా పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాం. ప్రతిరోజు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలి. గ్రామాల ప్రజలకు ఏమైన ఇబ్బందులు తలెత్తితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం.

తిమ్మాపూర్‌లో గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



గంగమాత విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

మోర్తాడ్, మే 14 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో బుధవారం గంగమాత దేవాలయం విగ్రహ ప్రతిష్ఠాపన పూజా వైభవంగా జరిగింది. ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి వచ్చారు. గత ప్రభుత్వ హయాంలో దేవాలయ నిర్మాణానికి రూ.40 లక్షలు ఎండోమెంట్ ద్వారా మంజూరు చేయించారు. పూర్తయిన ఆలయానికి విగ్రహ ప్రతిష్ఠాపన, అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆలయంలో పూజలు చేశారు. ఆయన వెంట సొసైటీ చైర్మన్ బద్దం అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గడ్డం చిన్నారెడ్డి, గంగపుత్ర సంఘం నాయకులు పాల్గొన్నారు.



కార్యాలయం ఎదుట బైఠాయించిన ప్రవీణ్ కుటుంబ సభ్యులు

మరణించి ఏడాదైనా బెనిఫిట్‌లు ఇవ్వడం లేదు

● కలెక్టరేట్ ఎదుట బాధిత కుటుంబ సభ్యుల ధర్నా

నిజామాబాద్ అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఏడాది క్రితం ధర్పల్లి వ్యవసాయ అధికారిగా పనిచేసి గుండెపోటుతో మృతి చెందిన ప్రవీణ్ కుటుంబానికి అందవల్సిన బెనిఫిట్‌లు అందకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన కుటుంబ సభ్యులు బుధవారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. నిజామాబాద్ రూరల్ ఏడీఏ అధికారులు ప్రవీణ్ మృతి చెంది ఏడాది గడిచినప్పటికీ తమ కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ అందకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన బాధలో ఉన్న తమను వ్యవసాయ శాఖ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని మృతుని భార్య, పిల్లలు ప్రవీణ్ ఫొటోతో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. తమను ఇబ్బందులకు గురి చేయవద్దని కోరారు. వ్యవసాయ శాఖలో ఏవోగా పనిచేసిన వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబానికి సహాయం చేయాల్సిన ఆ శాఖ అధికారులే వేధింపులకు గురిచేయడం చర్చనీయాంశం అయ్యింది. ఇప్పటికైనా కలెక్టర్ చొరవ చూపి మృతి చెందిన ప్రవీణ్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

'ఉద్యోగ, ఆరోగ్య భద్రత కరువైంది'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్మిక నాయకులు

ధర్పల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వల్ల ఉద్యోగ, ఆరోగ్య భద్రత కరువైందని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా నిజామాబాద్, కామారెడ్డి సంయుక్త జిల్లా కార్యదర్శి ఆర్.రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో కార్మిక నాయకులతో కలిసి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 11 సంవత్సరాల బీజేపీ ప్రభుత్వ పాలనలో కార్మికుల జీవన ప్రమాణాలు పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగాయని కానీ కార్మికుల వేతనాలు పెరగలేదన్నారు. కార్మికులకు ఉద్యోగ, ఆరోగ్య భద్రత కరువైందని మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పొరేట్ కంపెనీల అనుకూల కార్మిక వ్యతిరేక విధానాలే ఇందుకు కారణం అన్నారు. కనీస వేతనాల అమలు కోసం, కనీస పెన్షన్ రూ.9వేల అమలు కోసం, కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా, పని గంటల పెంపుదలకు వ్యతిరేకంగా జాతీయ కార్మిక సంఘాలు ఈనెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కార్మికలోకానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సుమన్, కృష్ణ, స్వరూప, రజిని, లక్ష్మి, శారద, రజిత, షహీనాబేగం పాల్గొన్నారు.

శాలివాహన చక్రవర్తి విగ్రహానికి స్థలం కేటాయించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘ సభ్యులు

ఇందల్వాయి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శాలివాహన చక్రవర్తి విగ్రహ ప్రతిష్ఠాపన కోసం స్థలాన్ని కేటాయించాలని శాలివాహన సంఘం సభ్యులు బుధవారం తహసీల్దార్ వెంకట్రావుకు వినతిపత్రాన్ని సమర్పించారు. శాలివాహన కమిటీ భవన నిర్మాణం, శాలివాహన విగ్రహానికి స్థలం కేటాయిస్తే నిర్మాణం పనులు చేపడతామని తహసీల్దార్‌కు వినతిపత్రంలో పేర్కొన్నారు. తహసీల్దార్ సానుకూలంగా స్పందించి మండల కేంద్రంలో స్థలం ఉంటే మంజూరు చేస్తానని పేర్కొన్నారు.

వన మహోత్సవానికి నర్సరీలు సిద్ధం

ధర్పల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో వన మహోత్సవానికి నర్సరీలు సిద్ధం అయ్యాయి. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో 22 నర్సరీలను ఏర్పాటు చేశారు. ఒక్కొక్క నర్సరీలో 8వేల మొక్కలను పెంచారు. ఇందులో భాగంగా ఈ యేడాది వన మహోత్సవానికి ప్రతీ నర్సరీ సిద్ధంగా ఉంది. వన మహోత్సవానికి అధికార యంత్రాంగం సమాయత్తం అవుతుంది. జూన్ మొదటి వారంలో ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామంలో 40వేల మొక్కలు నాటేందుకు మొదటిసారి నర్సరీలను ఏర్పాటు చేసింది. అనంతరం 20వేలు, 15వేలు, 10వేల మొక్కలను ఆయా గ్రామాల్లో నాటారు. ప్రస్తుతం ప్రతీ గ్రామంలో 8వేల మొక్కలను నాటేందుకు సిద్ధం చేశారు. గత ప్రభుత్వం హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు రోడ్డుకు ఇరువైపులాతో పాటు గ్రామాల్లో పచ్చదనం సంతరించుకుంది. నీడను ఇచ్చే చెట్లు ప్రస్తుతం వేసవికాలం కావడంతో ఎంతో ఉపయోగపడుతున్నాయని మండల ప్రజలు అంటున్నారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో అక్టోబర్ మొదటి వారం నుంచి మొక్కల పెంపకాన్ని ప్రారంభించారు. వర్షాకాలం ప్రారంభం కాగానే వన మహోత్సవంలో భాగంగా మొక్కలను నాటేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతుందన్నారు. దానికి సరిపడా 22 నర్సరీల్లో లక్షా 76వేల మొక్కలను నాటేందుకు సిద్ధం చేశారు. ఒక్కో నర్సరీలో 8వేల మొక్కలను పెంచగా వాటిని నాటేందుకు సిద్ధం చేస్తున్నారు. మండలంలో ఉపాధి హామీ కిందనే 22 నర్సరీలను ప్రారంభించారు. గతంలో అటవీశాఖ ఆధ్వర్యంలో సైతం నర్సరీలను నిర్వహించేవారు. కానీ ప్రస్తుతం అటవీ శాఖ ఆధ్వర్యంలో నర్సరీలు ప్రారంభించలేదు. ఎండవేడిని దృష్టిలో ఉంచుకొని మొక్కలు ఎండిపోకుండా గ్రీన్ నెట్‌లను ఏర్పాటు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శుల ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో పూల మొక్కలతో పాటు పండ్ల మొక్కలను నాటారు. ఇళ్లలో



ఒన్నాజిపేటలోని నర్సరీ

పెంచుకునేందుకు జామ, గులాబీ, మల్లే, దానిమ్మ, వేప, తులసీ, ఉసిరి, నిమ్మ, పొప్పాయి, అల్లనేరేడు, ఆకాశ మల్లె వంటి 20 రకాల మొక్కలను నర్సరీలో పెంచుతున్నారు. ఈసారి గీతకార్మికులను దృష్టిలో ఉంచుకొని ఈత మొక్కలను చెరువు కట్టలపై నాటేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

మండలంలోని 22 నర్సరీలు సిద్ధంగా ఉన్నాయి..

: వినోద (ఏపీవో)



వన మహోత్సవానికి మండలంలోని 22 నర్సరీలు సిద్ధంగా ఉన్నాయి. జూన్ మొదటి వారంలో మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఒక్కో నర్సరీలో 8వేల మేర మొక్కలను పెంచుతున్నాం. నాటిన ప్రతి మొక్కను రక్షించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. మండల ప్రజలు వన మహోత్సవానికి సహకరించాలి.

ఘనంగా సంతోషి సాయి ఆలయంలో మండల పూజ

నిజామాబాద్ కల్చరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని హమాల్‌వాడి సంతోషి సాయి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన జరుపుకొని 41 రోజులు కావడంతో బుధవారం ఘనంగా మండల పూజ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పూజలో భాగంగా శ్రీలక్ష్మి నర్సింహస్వామి జ్యోతిష్యాలయ పండితులు సేనాపతి సంపత్‌కుమారాచార్య వేదమంత్రాలు పఠించగా అర్చకులు శ్రీభాష్యం కృష్ణమాచార్య, విశ్వక్‌సేనా, పుణ్యాహవచన పూజలు జరిపారు. నవకలశాలను స్థాపించి ఆవాహిత దేవతలకు షోడశ పూజలు జరిపారు. ఆలయంలో ప్రతిష్ఠించిన మూల విగ్రహాలకు, ఉత్సవ విగ్రహాలకు నవకలశాలతో అభిషేకాలు నిర్వహించి నూతన వస్త్రాలతో అలంకరించారు. వేదమంత్రాలతో సుదర్శన నారసింహ, శ్రీ సూక్తం, పురుష సూక్తం, విష్ణు సూక్తం, నీలా సూక్తం, భూ సూక్తాలతో హోమ క్రతువును నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాదంలో భక్తులు పెద్ద



సుదర్శన హోమం చేస్తున్న పండితులు

సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూరు మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి సుప్రీంలో ఊరట

● భూ వివాదం కేసులో ముందస్తు బెయిల్ మంజూరు

న్యూఢిల్లీ, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆర్మూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత ఆశన్నగారి జీవన్ రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. భూ వివాదానికి సంబంధించిన కేసులో ఆయనకు సర్వోన్నత న్యాయస్థానం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. జీవన్‌రెడ్డితోపాటు ఆయన కుటుంబ సభ్యులు తన భూమిని కబ్జా చేశారని, అదేమని ప్రశ్నిస్తే మారణాయుధాలతో బెదిరించారని దామోదర్‌రెడ్డి అనే వ్యక్తి గతేడాది చేవెళ్ల, మోకిల పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. అయితే, ఆ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ జీవన్ రెడ్డి పిటిషన్ దాఖలు చేయగా హైకోర్టు నిరాకరించింది. 2025 మార్చి 21న హైకోర్టు తీర్పును జీవన్ రెడ్డి సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌పై బుధవారం జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. జీవన్ రెడ్డి విచారణకు అన్నివిధాలా సహకరిస్తున్నారని తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే జీవన్ రెడ్డి



కుటుంబ సభ్యులకు న్యాయస్థానంలో ముందస్తు బెయిల్ మంజూరైందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ అగర్వాల్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ ఇప్పటి వరకు మూడుసార్లు దర్యాప్తు అధికారి ఎదుట విచారణకు హాజరయ్యారని తెలిపారు. ఆయన వాంగ్మూలాలను సైతం నమోదు చేసినట్టు స్పష్టం చేశారు. అయితే, భవిష్యత్తులోనూ విచారణకు సహరించేలా షరతు విధిస్తూ బెయిల్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇరువాదనల అనంతరం.. జీవన్ రెడ్డికి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. దర్యాప్తునకు సహకరించకపోతే మళ్లీ తగు చర్యలు తీసుకోవచ్చని, న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని స్పష్టం చేసింది.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

● సమావేశంలో ఎంపీడీవో భూక్య లింగం

డిచ్‌పల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అర్హులకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా ఆయా గ్రామాల కార్యదర్శులు ప్రత్యేక చొరవ చూపాలని మండల అభివృద్ధి అధికారి భుక్యలింగం అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. అన్ని గ్రామాల్లో అర్హుల జాబితా గ్రామ కార్యదర్శుల వద్ద ఉన్నందున ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎక్కడ పొరపాట్లు జరగకుండా కార్యదర్శులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ



మాట్లాడుతున్న ఎంపీడీవో



సమావేశానికి హాజైన పంచాయతీ కార్యదర్శులు

సిబ్బంది అన్ని గ్రామాల్లో కార్యదర్శులను సమన్వయం చేసుకొని నర్సరీలలో మొక్కలు పెంచాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఈ అన్నపూర్ణ, ఆయా గ్రామాల కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాలను వాడేలా అవగాహన కల్పించాలి

(ఐదో పేజీ తరువాయి)

జేజీఎల్-33124, హెచ్ఎంటీ సోనా, మరుటేరు సాంబా, మరుటేరు మసూరి, ఎంటీయూ-1271 రకాలకు చెందిన సన్నధాన్యం వరి వంగడాలను విత్తుకోవాలని ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువుల విక్రయాలు జరగకుండా గట్టి పర్యవేక్షణ జరపాలన్నారు. సహకార సంఘాలలో ఎరువుల వాస్తవ నిల్వలు ఏ మేరకు ఉన్నాయి, రికార్డులలో పేర్కొన వాటికి అనుగుణంగానే నిల్వలు ఉన్నాయా లేదా అన్నది క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలన్నారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా అన్ని సొసైటీలకు చెందిన సేల్ పాయింట్లు, ఎరువులను నిలువ చేసిన గిడ్డంగులను విధిగా సందర్శించి ఎరువుల నిల్వల వాస్తవ వివరాలతో కూడిన నివేదికను వారం రోజుల్లో సమర్పించాలన్నారు. కాగా, భూభారతి అమల్లో భాగంగా లైసెన్సుడ్ సర్వేయర్ల శిక్షణ కోసం ఆసక్తి, అర్హత కలిగిన వారు మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు చేసుకునేలా చూడాలన్నారు. ఇప్పటికే ప్రైవేటు సర్వేయర్లుగా పనిచేస్తున్న వారు ప్రభుత్వం నుంచి లైసెన్సులు పొందేందుకు వీలుగా సీసీఎల్ఏ కమిషనర్ కార్యాలయానికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రేషన్ కార్డుల కోసం, రాజీవ్ యువ వికాసం పథకం కింద వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. జూన్ మొదటి, రెండో వారంలో ప్రారంభమయ్యే వన మహోత్సవం కార్యక్రమానికి అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని, మొక్కల పంపిణీ కోసం నర్సరీలలో సరిపడా మొక్కలు అందుబాటులో ఉంచాలన్నారు. వీసీలో అదనపు కలెక్టర్‌లు అంకిత్, కిరణ్‌కుమార్, బోధన్‌సబ్ కలెక్టర్ వికాస్‌మహతో, డీఆర్‌డీవో సాయాగౌడ్ పాల్గొన్నారు.

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన

నిజామాబాద్ అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ పదవ తరగతి ఫలితాలలో జిల్లాస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన ఎస్ఎస్ఆర్ డిస్కవరీ, ఎస్ఎస్ఆర్ సీనియర్ సెకండరీ స్కూల్ జన్నేపల్లి విద్యార్థులను బుధవారం మాధవనగర్‌లోగల ఎస్ఎస్ఆర్ డిస్కవరీ పాఠశాలలో యాజమాన్యం అభినందించింది. పాఠశాలకు చెందిన విద్యార్థులు కనక్ ఇనాని 476/500, రీచా బజాజ్ 465/500, సహస్రశ్రీరాం 451/500, సంవేద్య 449/500, సహస్రరెడ్డి 448/500, రాంబత్రివేణు 446/500, శివచైతన్య 444/500, నవ్య 443/500, కీర్తిరెడ్డి 441/500, యోశిత్‌రెడ్డి 439/500 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను శాలువతో అభినందించారు. తల్లిదండ్రులను సైతం విద్యాసంస్థల చైర్మన్ మారయ్యగౌడ్, సీఈవో హరితగౌడ్‌లు సన్మానించారు.

'కళాశాలపై చర్యలు తీసుకోవాలి'

నిజామాబాద్ అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా నగరంలో నిర్వహిస్తున్న ఓ ప్రైవేటు కళాశాలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని టీజీవీపీ ఆధ్వర్యంలో బుధవారం డీఐఈవో రవి కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కళ్యాణ్ మాట్లాడుతూ.. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆల్ఫోర్స్ కళాశాల ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే విద్యాసంస్థను ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్, సుజిత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమ్‌లో పోగొట్టుకున్న డబ్బులు

● ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

కోటగిరి, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ గేమ్ ఆడి డబ్బులు పోగొట్టుకోవడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. రుద్రూరు ఎస్సై సాయన్న కథనం ప్రకారం.. జిల్లాలోని రుద్రూరు మండలం రాయకూర్ గ్రామానికి చెందిన గంగాధర్(20) చదువు మధ్యలోనే మానేసి.. ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలోనే సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడ్డాడు. ఇందులో భాగంగానే మంగళవారం తన తండ్రి పోశెట్టి సెల్ నుంచి 5వేల రూపాయలు తన ఫోన్‌కు పంపుకుని ఆన్‌లైన్ గేమ్స్ ఆడాడు. గేమ్‌లో డబ్బులు పోగొట్టుకోవడంతో తండ్రి కోప్పడుతాడేమోనని భయపడ్డాడు. ఈ క్రమంలోనే తీవ్ర మనస్తాపానికి గురైన గంగాధర్ గ్రామ శివారులో గల చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి పోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

కమ్యూనిటీ మధ్యవర్తుల అవగాహన సదస్సు

నిజామాబాద్ లీగల్, మే 14 (ఆంధ్రజ్యోతి): చిన్న సమస్యలతో కోర్టులో కేసు వేసుకొని సమయాన్ని వృథా చేసుకునే వారికి కమ్యూనిటీ మధ్యవర్తుల ద్వారా రాజీ కుదిర్చి సమస్య పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో కమ్యూనిటీ మధ్యవర్తులకు అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయాధికారి, న్యాయ సేవ సంస్థ చైర్‌పర్సన్ జీవీఎన్ భరతలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశాల మధ్య యుద్ధాలే మధ్యవర్తిత్వంతో సమస్యల్ని పరిష్కరించుకుంటున్నాయని, గ్రామాల్లో చాలామంది చిన్న సమస్యతో కోర్టు సమయాన్ని వృథా చేస్తున్నారని అన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. మధ్యవర్తిత్వానికి సంఘ సభ్యుల పాత్రా చాల అవసరమన్నారు. అనంతరం అదనపు డీసీపీ బస్వారెడ్డి మాట్లాడుతూ.. కమ్యూనిటీ మధ్యవర్తులకు పోలీసులకు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. న్యాయ సేవ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్ భాస్కర్ రావు మాట్లాడుతూ.. జిల్లా లో ఇప్పటికే కమ్యూనిటీ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఇంకా వాటి సంఖ్య పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, బార్ కౌన్సిల్ సభ్యుడు రాజేందర్ రెడ్డి, బార్ అధ్యక్షుడు సాయిరెడ్డి పాల్గొన్నారు.

బిచ్కుంద పోలీసు స్టేషన్‌లో ఏసీబీ సోదాలు

● ఇసుక ట్రాక్టర్లను వదిలేందుకు డబ్బులు డిమాండ్ చేసినట్లు ఏసీబీకి ఫిర్యాదు
● దీంతో పోలీసుస్టేషన్‌లో తనిఖీలు చేపట్టిన ఏసీబీ
● విచారణ కొందరు పోలీసులు డబ్బులు వసూలు చేసినట్లు వెల్లడి
● కొందరు పోలీసులు డబ్బులు వసూలు చేసినట్లు ఆధారాలు దొరికాయి
● పూర్తి రిపోర్టు తయారుచేసి ఏసీబీ ఉన్నతాధికారులకు నివేదిస్తాం
● ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ వెల్లడి

బిచ్కుంద, మే 14(ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లను కామారెడ్డి జిల్లా బిచ్కుంద పోలీసులు ఇటీవల సీజ్ చేయగా.. ఆ ట్రాక్టర్లను విడుదల చేసేందుకు డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలతో.. ఏసీబీ అధికారులు కామారెడ్డి జిల్లా బిచ్కుంద పోలీసు స్టేషన్‌లో బుధవారం సోదాలు చేశారు. ఈ విచారణలో బిచ్కుంద పోలీసుస్టేషన్‌లోని కొందరు పోలీసులు ఇసుక ట్రాక్టర్లను వదిలేందుకు డబ్బులు వసూలు చేసినట్లు తేలింది. ఇందుకు సంబంధించిన ఆధారాలు కూడా లభ్యమయ్యాయని ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపారు. ఏసీబీ డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం..



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్

కామారెడ్డి జిల్లాలోని బిచ్కుంద పోలీసుస్టేషన్ పరిధిలో గతనెల 27వ తేదీన మంజీర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 10 ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించారు. దీంతో ట్రాక్టర్ యాజమానులు మైనింగ్ శాఖకు పెనాల్టీ చెల్లించి.. ఆ రశీదులతో పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. అయితే పోలీసుస్టేషన్‌లోని అధికారులు, సిబ్బంది ట్రాక్టర్‌లను విడుదల చేయకుండా ఇబ్బందులకు గురిచేయడంతో బాధితులు వారం రోజుల క్రితం ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ తన సిబ్బందితో కలిసి బుధవారం బిచ్కుంద పోలీసుస్టేషన్‌కు వచ్చారు. పోలీసుస్టేషన్‌లో సదరు పోలీసు అధికారులతో పాటు సిబ్బంది, ట్రాక్టర్ యాజమానులు, డ్రైవర్లను విచారించారు. ఇప్పటికి పోలీసుస్టేషన్ ఆవరణలో సీజ్ చేసిన 10 ట్రాక్టర్లు ఉండడం.. మైనింగ్ శాఖకు పెనాల్టీ కట్టినప్పటికీ ఎందుకు విడుదల చేయలేదన్న విషయమై ఏసీబీ అధికారులు లోతుగా విచారణ చేపట్టారు. సుమారు 4 గంటల పాటు బిచ్కుంద పోలీసుస్టేషన్‌లో ఏసీబీ అధికారులు సోదాలు చేసి విచారించారు. సోదాల అనంతరం ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ విలేకరులతో మాట్లాడారు. 10 ఇసుక ట్రాక్టర్లను విడుదల చేసేందుకు బిచ్కుంద పోలీసుస్టేషన్‌లోని కొందరు పోలీసులు డబ్బులు వసూళ్లు చేశారన్న ఆరోపణలతో పాటు పెద్ద ఎత్తున ఫిర్యాదులు కూడా వచ్చాయని తెలిపారు. దీంతో సోదాలు చేసి విచారించగా ట్రాక్టర్లను విడుదల చేసేందుకు కొందరు పోలీసులు డబ్బులు వసూలు చేసినట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఈ 10 ఇసుక ట్రాక్టర్లనే కాకుండా మామూలు సమయాల్లోనూ పోలీసుస్టేషన్‌లోని కొందరు పోలీసులు అక్రమ ఇసుక వాహనాలను వదిలేందుకు తరచూ డబ్బులు వసూలు చేసినట్లు తేలిందన్నారు. కొన్ని ఆధారాలు కూడా దొరికాయని, ఈ ఆధారాల ప్రకారం సమగ్రంగా రిపోర్టును తయారు చేసి ఏసీబీ ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. మంజీర పరివాహక ప్రాంతాల్లో చాలారోజుల నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు ఏసీబీకి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఫిర్యాదు చేసే వారు ముందుకు రావడం లేదన్నారు. కొందరు ఫిర్యాదుదారులు ముందుకు వచ్చినా.. భయపడి వెనక్కి పోతున్నారన్నారు. ఫిర్యాదు చేయాలనుకునే వారు ధైర్యంగా ముందుకు వచ్చి ఏసీబీని ఆశ్రయించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపారు.

చికెన్ ధరలు



రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.130	రూ.240	రూ. 260
వెన్‌కాబ్(కిలో)	: రూ.140	రూ.250	రూ. 270

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.96,400	రూ.88,900	రూ.1020

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : షిన్ చాన్ అవర్ డైనోసర్ డైరీ (తెలుగు) (11.20)
: సింగిల్ (1.40, 4.40, 7.25, 10.10)
స్క్రీన్-2 : తుదురం (11.00)
: శుభం (2.20, 5.00, 7.40, 10.20)
స్క్రీన్-3 : రైడ్-2 (హిందీ) (10.20, 1.15, 7.20)
: హిట్-3 (4.10, 10.20)
స్క్రీన్-4 : జగదేకవీరుడు అతిలోక సుందరి (10.45, 2.00, 7.30)
: షిన్ చాన్ అవర్ డైనోసర్ డైరీ (తెలుగు) (5.10)
: రైడ్-2 (హిందీ) (10.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : సింగిల్ (11.00, 4.40)
: హిట్-3 (1.30, 7.30)
: జగదేకవీరుడు అతిలోక సుందరి (10.30)
స్క్రీన్-2 : సింగిల్ (1.30, 7.30, 10.30)
: శుభం (4.40)
స్క్రీన్-3 : జగదేకవీరుడు అతిలోక సుందరి (11.00, 4.30)
: శుభం (1.40, 7.20, 10.20)

లలితామహల్ : శుభం (11.15, 2.15, 6.15, 9.15)
దేవి : సింగిల్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : జగదేకవీరుడు అతిలోక సుందరి (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : హిట్-3 (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్